చివరకు అది ఒక కేసు అయ్యింది. డి. ఇ. ఓ. ఆఫీసునుంచి హెడ్‌మాస్టర్‌గారికి సంజాయిషీ చెప్పుకోవలసిందిగా కోరుతూ పత్రాలు వచ్చాయి. హెడ్‌మాస్టర్‌గారు ఉన్నవీ, లేనివీ పది కల్పించి శాస్త్రిగారు ఉపాధ్యాయులు హెడ్మాస్టర్‌పై ఎదురు తిరిగేలా చేశారనీ, స్కూల్లో క్రమశిక్షణ లోపించడానికిఆయనే ప్రధాన కారణమనీ, ఆయన పరీక్షా పత్రాలు బయటపెట్టి పాఠశాల ప్రతిష్ఠ పోగొట్టారనీ, అదేమని తాను అడిగితే ఉపాధ్యాయులందరి సమక్షంలోను తన్ను నానామాటలూ అని చాలా అవినయంగా, అమర్యాదగా, అసభ్యంగా ప్రవర్తించారనీ రిపోర్టు వ్రాశారు.

అటు తర్వాత శాస్త్రిగారు కోర్టుకు వెళ్ళక తప్పలేదు. నేను పట్నంవెళ్ళి ప్లీడరుగారితో మాట్లాడి కేసు ఒప్పగించి వచ్చాను.

ఆ వచ్చిన క్షణంనుంచీ హెడ్‌మాస్టర్‌గారు నా మీద కారాలూ మిరియాలూ నూరడం ఎక్కువైంది. ఒకసారి ఆలస్యంగా వచ్చాననీ, మరోసారి ముందుగా వచ్చికూడా క్లాసుకు ఆలస్యంగా వెళ్ళాననీ, అదనీ, ఇదనీ సాధింపు మొదలు పెట్టారు. నాకు 'ఎక్స్ట్రావర్కు' వెయ్యడం మరీ ఎక్కువైంది. కావాలని తన అభిమానులను అక్కడికీ ఇక్కడికీ పంపి, వాళ్ళ పీరియళ్ళు నాకు వేయడం, వాళ్ళు చెప్పే పాఠాలు కూడా నేను చెప్పాలని పట్టుపట్టటం మొదలు పెట్టారు.

హెడ్‌మాస్టర్‌గారు నన్నేకాదు, తనపక్షం వహించడంలేదని అనుమానం కలిగినవారిని అందరినీ ఇదే విధంగా వేధించడం మొదలు పెట్టారు. శాస్త్రిగారి కేసుకు సంబంధించిన వ్రాతకోతలన్నీ రామారావుగారు చూస్తున్నారని ఆయన మీదా కోపంగానే ఉన్నది. కాని ఆయనంటే హెడ్‌మాస్టరుగారికి లోపల భయం. అందుకు సరియైన కారణం మా కెవరికీ బాగా తెలియదు. ఆయన చాలా మంచివాడు. కాని ఒట్టి ఆవేశపు మనిషి. తన బలహీనత తనకు తెలుసు కనుక, సర్వ సామాన్యంగా ఎవరి జోలికీ పోరు. నవ్వుతూ అంటే ఎన్ని అయినా పడతారు. కోపంగా ఒక్కమాట అన్నామా, విరుచుకు పడిపోతారు. ఎదుటివాణ్ణి హడలు కొట్టేస్తారు. అకారణంగా మాట పడరు. మాట పడవలసిన సందర్భం రానీయరు. ఎన్నడూ ఒక్కసారి కూడా ఆయన బడికి ఆలస్యంగారారు. హెడ్‌మాస్టరుగారు వెళ్ళమన్నా మరొకరి క్లాసుకు ఆయన వెళ్ళి ఎరగరు. వెళ్ళలేదేమని హెడ్మాస్టరుగారు ఆయన్ను అడిగీ ఎరగరు.

రామారావు మాస్టరుగారు బాగా ఉన్న మనిషి. ఆయన వయస్సులో చాలా చిన్నవారు. అన్నింటికంటె మిన్నగా పెద్ద విద్యార్హతలు ఉన్నాయి ఆయనకు. ఆయనమీద తనకోపం ప్రదర్శించడానికి మరో వంక దొరక్క హెడ్‌మాస్టర్‌గారు "శాస్త్రిగారి కేసంతా మీరే వ్రాసి పెడుతున్నారటగా" అన్నారు ఒకసారి.

"అవును, వ్రాస్తున్నాను. మీకు వ్రాసి పెట్టమన్నా వ్రాసిపెడతాను. నేను మంచి వ్రాయసకాడను" అన్నారు రామారావుగారు నవ్వుతూ.

తనూ నవ్వవలసిందిపోయి అకారణంగా చిరబిగుసుకుపోయి "నిజమే నన్నమాట! మీరింత లొటిటిగెంటని నే నెరగను" అని మాటతూలారు హెడ్‌మాస్టర్‌గారు. అంతే. రామారావుగారికి కోపం వచ్చేసింది. కోపంతో వణికిపోతూ "ఏమిటి? ఏమిటన్నారు— మళ్ళీ అనండి" అంటూ ముందుకు రావడం, హెడ్‌మాస్టర్‌గారు భయపడి వరండాలన్నీ చుట్టబెట్టి కొసకు తన గదిలో తలదాచుకోవడం జరిగింది.

హెడ్మాస్టర్‌గారలా పరుగులు పెడుతుంటే పిల్లలంతా తరగతుల నుంచి బయటకు వచ్చి విరగబడినవ్వారు. పిల్లలకేమిటి, నాకే నవ్వు ఆగలేదు.

మరు క్షణంలో పరిస్థితి ఎక్కడ మితిమీరిపోతుందో అన్న భయం కలిగి చప్పున అక్కడికి వెళ్ళాను. రామారావుగారు బయట నిల్చొని "రండి, బయటకు రండి. క్షమాపణ చెప్పకపోతే ఊరుకొనేదిలేదు" అని అరుస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఆ వరండాలో దూరంగా నిలబడి ఉన్నారు. భయపడ్డారో ఏమో, ఎవరూ దగ్గరకు వెళ్ళలేదు.


నేను నెమ్మదిగావెళ్ళి ఆయన చెయ్యి పుచ్చుకొని మా ఉపాధ్యాయుల గదికి తీసుకొని వచ్చాను. దారిలో ఆయన నన్ను ఎన్నో అన్నారు. అన్నాక కోపం తీరిపోయింది. నేను క్లాసుకు వెళ్ళాను.

కోపం పొంగు చల్లారాక ఆయనలో మరో వింత మార్పు వచ్చింది. అప్పటికప్పుడు ఉద్యోగానికి రాజీనామా వ్రాసి హెడ్మాస్టర్ గారికి పంపించి ఇంటికి వెళ్ళి ఆ పూటకు ఆ పూట ఊరు విడిచి వెళ్ళిపోడానికి సిద్ధమయ్యారు.

స్టేషన్లో నేను ఎంతో బతిమాలాను, జరిగిన సంఘటన మరిచిపోయి రాజీనామా ఉపసంహరించుకోమని. ఆయన ససేమిరా కాదన్నారు. "అటువంటి మనిషిక్రింద పని చెయ్యడమా? వద్దు. చేసిందిచాలు" అన్నారాయన. పోనీ, ఆ ఏడాది చివరిదాకా ఉండమనీ, ఆలోపల శాస్త్రిగారి కేసు పరిష్కారం కాగల అవకాశం ఉందనీ చెప్పి చూచాను. లాభం లేకపోయింది. చివరకు "నాకోసం ఉండండి. శాస్త్రిగారు రాకుండా ఉంటేనే స్కూలు బోసిపోతోంది. ఇక మీరు కూడా వెళ్ళితే నాకు మతిపోతుంది. పలకరించే వారుండరు. కనీసం నా క్షేమంకోసం ఉండండి" అని ప్రాధేయపడ్డాను. ఆయన వినలేదు. "పోనీ, కొన్నాళ్ళపాటు ఊళ్ళోఉండండి" అని వేడుకొన్నా వినక ఆయన రైలెక్కారు.

* * * *

ఆయన అలా వెళ్ళిపోయినా హెడ్‌మాస్టరుగారికి ఆయన మీద కక్ష పోలేదు. నెల నోటీసు ఇవ్వకుండా వెళ్ళారు కనుక, నెలజీతం కక్కించాలని పట్టుపట్టారు. ఏంబుద్ధి పుట్టిందో ప్రెసిడెంటుగారు కల్పించుకొని వెంటనే రామారావుగారికి రిలీవింగ్ ఆర్డరు పంపించారు. అటు శాస్త్రిగారూ, ఇటు రామారావుగారూ ఇద్దరూ లేకపొయ్యేసరికి మా బళ్ళో ఉపాధ్యాయసంఘం బలహీనపడ్డది. కార్యదర్శి ఎన్నికలో చాలామంది భయపడి ముందుకు రాలేదు. తప్పని సరయి నేను కార్యదర్శిగా పనిచెయ్యడానికి అంగీకరించాను.



చిత్రం — ఎస్. జయదేవ్ బాబు (మద్రాసు-21)

రామారావుగారు వెళ్ళిపోయినప్పటినుంచీ మా హెడ్మాస్టరుగారు మరీ పేట్రేగిపొయ్యారు. ఊరికే కేకలు, బొబ్బలు పెట్టడం ఎక్కువైపోయింది. మా బళ్ళో ప్రాథమిక తరగతులకు చెప్పే ఉపాధ్యాయులను ఆయన మరీ హడల గొట్టారు. వాళ్ళముందు వరండా ఉపన్యాసాలు ఎక్కువయ్యాయి. దీనికితోడు ఆయన దన్ను చూచుకొని, ఆయన బలహీనత ఆసరా చేసుకొని వెంకటరెడ్డిగారూ, కృష్ణయ్యగారూ విచ్చలవిడిగా మా కెదురేమిటి? అన్నట్లు ప్రవర్తించారు. వారిద్దరూ క్లాసులకు వెళ్ళడమే మానివేశారు. ఎంతసేపూ హెడ్‌మాస్టరుగారి గదిలో కూర్చుని ఆయనగారితో ఆమాస్టరు ఇల్లా అన్నాడనీ, ఈ మాస్టారు అల్లా అన్నాడనీ పితూరీలు; ఎవరెవరో కుట్రలు పన్నుతున్నారనీ, ముందుగా కుట్రలు భగ్నం

